ప్రజాశక్తి

శుక్రవారం 20 డిసెంబర్ 2024 5

అనంతపురం





అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు



కార్మికుల భద్రత గాలికి...!

- పరిశ్రమల్లో ప్రాణాలతో చెలగాటం
- ప్రమాద పరిస్థితుల్లో పనులు
- సొంతలాభానికి పరిశ్రమల యాజమాన్యాలు పరిమితం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న కార్మికులు ఎప్పుడు ఏ ప్రమాదం బారిన పడుతారో తెలియని పరిస్థితులు ఉన్నాయి. యాజమాన్యాలు కనీస అప్రమత్తత చర్యలు తీసుకోకుండానే అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. పరిశ్రమల్లో ప్రమాద ఘటన జరిగి విషయం బయటకొస్తేనే అధికారుల హడావుడి కన్పిస్తోంది.. లేకుంటే చర్యలు నామ మాత్రంగానే ఉంటాయన్న విమర్శలూ ఉన్నాయి. జిల్లా సేఫ్టీ కమిటీలున్నప్పటికీ అవి మొక్కుబడి తనిఖీలతోనే మమ అనిపించేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

ప్రమాద కారణాలు వెలుగులోకొచ్చేనా ..?

అనంతపురం జిల్లా యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఆదానికి సంబంధించిన అంబూజా సిమెంటు పరిశ్రమలో ప్రమాదం చోటు చేసుకుంది. పెన్నా సిమెంటుగానున్న ఈ పరిశ్రమను ఇటీవలే ఆదానికి సంబందించిన అంబుజా సిమెంట్ టేక్ఓవర్ చేసింది. ఈ పరిశ్రమలో మరమ్మతుల కోసం షట్డౌన్ చేసినట్టు చెబుతున్నా.. షట్డౌన్ చేసిన పరిశ్రమలో అంత పెద్దఎత్తున మంటలు ఏ విధంగా ఉన్నాయన్న సందేహాలున్నాయి. ప్లాంట్ రన్నింగులో ఉండగానే కార్మికులతో ప్రమాద స్థలాల్లో పనిచేయించారన్న ఆరోపణలున్నాయి. దీనిపై సమగ్రమైన విచారణకు ఇన్ఛార్జి కలెక్టర్ శివ్నారాయణ శర్మ ఆదేశించారు. సేఫ్టీ కమిటీ పరిశీలించి అందులో ప్రమాదానికిగల కారణల్లో వాస్తవాలు ఏ మేరకు బయటకొస్తాయన్నది చూడాల్సి ఉంది.



ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ తాడిపత్రి ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

పరిశ్రమల్లో అనేక ఘటనలు..

జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో వెలుగులోకి వస్తున్నవి కొన్నిమాత్రమే. 2018లో ఆర్జాస్ స్టీల్ పరిశ్రమలో గ్యాస్ లీకైన ఘటనలో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. ఇది జరిగిన మరుసటి ఏడాదే 2019లో అదే పరిశ్రమలో ఇనుప హుక్కు పైనుంచి పడి కార్మికుడి గొంతు తెగిపడి మృతి చెందాడు. ఈ ఘటనలో మల్లేష్ అనే కార్మికుడి చనిపోయాడు. 2021లో హిందూపురంలో ఒక ఫార్మ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందాడు. విడపనకల్లులో యాపిల్ పరిశ్రమ ఎస్ఎల్వి పరిశ్రమలోనూ ప్రమాదాలు జరిగాయి. పెనుకొండ వద్ద కియా పరిశ్రమలో ఒక కార్మికుడు మృతి చెందాడు. కాని యాజమాన్యం అది ప్రమాదం కాదని సహజమరణమని చెబుతోంది. అనంతపురం సమీపంలోని కర్నూరం ఫ్యాక్టరీలోనూ ఇటీవల ప్రమాదం చోటు చేసుకుంది. ఇవి కాకుండా ఇప్పుడు ప్రమాదం జరిగిన పెన్నా పరిశ్రమలో గతంలో రెండుసార్లు బాయిలర్ వద్దనే ప్రమాదం జరిగింది. ఇలా తరచూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నా నివారణకు తీసుకుంటున్న చర్యలు మొక్కుబడిగా ఉంటున్నాయి.

నిరంతరం తనిఖీలు నిర్వహించాలి



ప్రమాదాలపై తరచూ జిల్లా సేఫ్టీ కమిటీ తనిఖీలు నిర్వహించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. ఇటీవలి కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది దాక పరిశ్రమల్లో కార్మికులు చనిపోయారు. కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ప్రస్తుతం అంబుజా సిమెంట్ పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనపై న్యాయపరమైన విచారణ చేపట్టాలి. మృతి చెందిన కార్మికుని కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలి. అతని భార్యకు శాశ్వత ఉద్యోగం, కుమారుడి సంరక్షణ నిమిత్తం నెలకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. క్షతగాత్రులకు తక్షణ సహాయం కింద రూ.20 లక్షలు ఇవ్వాలి.

ఓబులు, సిఐటియు రాష్ట్ర నాయకులు

అమిత్‌షా వ్యాఖ్యల్లో మనువాద భావజాలం

- అంబేద్కర్‌ను కించపరచడం సిగ్గుచేటు
- హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలి
- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారత రాజ్యంగ నిర్మాత డా॥బిఆర్.అంబేద్కర్‌ను కించపరిచేలా రాజ్యసభ సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు మనువాదం భావజాలానికి అద్దం పడుతున్నాయని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప విమర్శించారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే పదవికి రాజీనామా చేసి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో అనంతపురంలో గురువారం నాడు నిరసన చేపట్టారు. జెడ్పీ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత దుర్మార్గం అన్నారు. దేశంలో అన్ని వ్యవస్థలు, కులాలు, మతాలకు అతీతంగా అందరి సంక్షేమం కోరుతూ రాజ్యాంగాన్ని రూపొందించిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. అలాంటి వ్యక్తిని అమిత్‌షా కించపరిచేలా మాట్లాడడం నీచమైన చర్య అన్నారు. భారతదేశ రాజ్యాంగాన్ని తాము ఆమోదించడం లేదంటూ రాజ్యాంగాన్ని పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టినప్పుడు ఆర్ఎస్ఎస్ ప్రకటించిందన్నారు. అలాంటి ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చి దేశాన్ని పాలిస్తున్న ప్రస్తుత బిజెపి పాలకుల నోటి వెంట పదేపదే రాజ్యాంగాన్ని కించపరిచే మాటలు వస్తున్నాయన్నారు. సామాజిక తరగతులు అన్ని వర్గాల సంక్షేమం, రక్షణకు నిలయమైన రాజ్యాంగాన్ని ప్రస్తుత బిజెపి పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో అంబేద్కర్‌ను కించపరుస్తూ, దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్, జిల్లా నాయకులు జీవరత్నం, రాజా, అక్కులప్ప, సిఐటియు నాయకులు ఎటిఎం.నాగరాజు, నాగేంద్ర, నారాయణస్వామి, డేవిడ్, ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులు వెంకటేశులు, కార్తీక్, నాగు, నారాయణస్వామి, నాగభూషణం, రామన్న పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ఉల్లంఘనలపై చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



హైకోర్టు సూచనలతో రోడ్డు భద్రత ఉల్లంఘనలపై చర్యలను మరింత పటిష్టం చేస్తున్నామని ఎస్పీ పి.జగదీష్ స్పష్టం చేశారు. గురువారం ఆయన స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తాజాగా సూచించిన మేరకు జిల్లా అంతటా తనిఖీలను మరింత ఎక్కువ చేశామన్నారు. ఉల్లంఘనదారులకు చలానాలు జారీ అయ్యాక మూడు నెలల్లోపు అపరాధ రుసుం తప్పనిసరిగా చెల్లించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపితే ఆ తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్, ఆటోల ఓవర్లోడింగ్, డ్రంకన్ డ్రైవ్, ఆపోజిట్ డ్రైవింగ్, నంబర్ లెస్ వాహనాలు, ర్యాష్ డ్రైవింగ్, రేసింగ్ తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఆర్‌సిలను వారి వద్ద ఉంచుకోవాలన్నారు.



మహాసభల గోడపత్రికలను విడుదల చేస్తున్న సిపిఎం నగర కమిటీ నాయకులు

సిపిఎం జిల్లా మహాసభల గోడపత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 23, 24వ తేదీల్లో అనంతపురం నగరంలో జరుగుతున్న సిపిఎం 14వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్ట్స్ కాలేజ్ ఆటో స్టాండ్ దగ్గర గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ 23,24వ తేదీల్లో అనంతపురం గుత్తి రోడ్డులో గల ఎన్ఎస్, గ్రాండ్‌లో మహాసభలు జరుగుతాయన్నారు. మహాసభల సందర్భంగా 23వ తేదీ వేలాది మందితో నగరంలో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు హాజరవుతున్నారన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌వి.నాయుడు, వెంకటనారాయణ, నగర కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, కమిటీ సభ్యులు, ఎన్టీఆర్ శ్రీనివాసులు, ఏటీఎం నాగరాజు, వెంకటేష్, లతీఫ్, ఆటో యూనియన్ నాయకులు ఆజాం, నాగరాజు, భాస్కర్, మక్బుల్ బాషా, రామంజి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమావేశం

ప్రజాశక్తి-యల్లనూరు

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి మండల విస్తరణ అధికారి మనోహర్ బాబు ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహిస్తూ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి సర్వేతో పాటు ఇంటి, కొళాయి పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జీపు డ్రైవర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-యల్లనూరు



మాట్లాడుతున్న సిఐ సత్యబాబు

రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా జీపుడ్రైవర్లకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో గురువారం నాడు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటో, జీపుల్లో అధిక లోడుతో ప్రయాణికులను తరలించరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

12 మంది జీపు డ్రైవర్ల బైండోవర్

మండల కేంద్రంలోని 12 మంది జీపు డ్రైవర్లను బైండోవర్ చేసినట్లు సిఐ సత్యబాబు తెలిపారు. జీపులకు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్‌సిలు లేకుండా ఓవర్ లోడు, ప్రజా రవాణా అవసరాలకు జీపులను ఉపయోగిస్తున్న కారణంతో బైండోవర్ చేసినట్లు చెప్పారు. తహశీల్దార్ ఎదుట వీరిని హాజరుపరిచి బైండోవర్ చేశామన్నారు.

పంట ప్రీమియం గడువు పొడిగింపు

ప్రజాశక్తి-యల్లనూరు

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ 31 వరకు గడువు పొడిగించిందని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో రైతులు ఇంకా ఎవరైనా బీమా ప్రీమియం చెల్లించకుంటే ఈ నెల 31లోపు చెల్లించుకోవాలని తెలియజేసారు.

నేడు 'వి.రాంభూపాల్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమకాలీన ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులపై సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ రాసిన మూడు పుస్తకాలను శుక్రవారం నాడు విడుదల చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప తెలిపారు. ఆర్థిక అసమానతలు, విద్వేష రాజకీయాలు, రైతులను ముంచుతున్న పాలకుల విధానాలపై లోతైన విశ్లేషణలు ఈ పుస్తకాల్లో ఉన్నాయన్నారు. ప్రజా ఉద్యమాల్లో ఉన్న వారి దృష్టికి అనేక సమస్యలు వస్తుంటాయని, వాటి మూలాలను అర్థం చేసుకుని ప్రజలకు సులభశైలిలో వివరించడం కమ్యూనిస్టుల పని పద్ధతన్నారు. అందుకు రాంభూపాల్ రాసిన పుస్తకాలు తోడ్పడుతాయన్నారు. శుక్రవారం సాయంత్రం 5గంటలకు అనంతపురం కొత్త జెడ్పీ కార్యాలయంలో పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా అధ్యక్షతన జరిగే ఈ సభలో ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సత్యబోస్‌లు హాజరై ఆవిష్కరిస్తారన్నారు. వామపక్ష నాయకులు జగదీష్, ఓబులు, ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, రాఘవేంద్ర, చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మేధావులు, ఉద్యమకారులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధి సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి-యల్లనూరు

ఉపాధి సిబ్బందితో గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎపిఒ షబ్బీర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి హామీ కింద మంజూరైన పశువుల షెడ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు శంకర్, ప్రతాప్, జయరాం, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై పోరుకు సిద్ధమవుదాం

ఉమ్మడి జిల్లా వైసిపి నేతలతో వైఎస్.జగన్



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి అనంతపురం జిల్లా వైసిపి నాయకులు



ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై పోరుకు సిద్ధం అవ్వాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో జగన్మోహన్‌రెడ్డి గురువారం ఉదయం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులకు భవిష్యత్తు కార్యచరణపై దిశానిర్దేశం చేస్తూ మాట్లాడారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం విజన్ పేరుతో మేనిఫెస్టోను ఎగ్గొట్టే ప్రణాళిక చేస్తోందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు అటెకెక్కాయని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా చంద్రబాబు నాడు అబద్దాలు, మోసాలతో పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల మేనిఫెస్టో, సూపర్‌సిక్స్‌ను అమలు చేయలేక చంద్రబాబు చెప్పిన మాటలు మోసాలై ప్రజలకు కన్పిస్తున్నాయి. ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను అపహాస్యం చేశారన్నారు. ఆరు నెలల్లో 3.14 లక్షల పింఛన్లను ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. విద్యుత్ భారాలను ప్రజలపై మోపారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ వైసిపి శ్రేణులు పోరుబాటకు సిద్ధం కావాలని జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతికార్యకర్త సోషల్ మీడియా సైనికుడు కావాలన్నారు. ప్రతిపక్షంలో కష్టాలు, కేసులు సహజమని వాటిని ఎదిరించి ముందుకు సాగాలన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వైసిపి, జగన్ అండగా ఉంటారని భరోసానిచ్చారు. జనవరి నుంచి తాను జిల్లాల పర్యటన చేస్తున్నట్లు జగన్మోహన్‌రెడ్డి తెలియజేశారు. 'కార్యకర్తలతో జగనన్న పార్టీ బలోపేతానికి దిశ నిర్దేశం' పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాని తెలిపారు. ఈ లోగా పార్టీ సంస్థాగత నిర్మాణాలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉషశ్రీచరణ్, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, శంకరనారాయణ, నియోజకవర్గ సమన్వయ కర్తలు మెట్టు గోవిందరెడ్డి, ఆలూరు సాంబశివారెడ్డితో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ఎస్‌కెయు రెక్టార్ వెంకట నాయుడు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రెక్టార్ వెంకటనాయుడు

ప్రజాశక్తి -అనంతపురం

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రానించాలని ఎస్‌కెయు రెక్టార్ వెంకట నాయుడు తెలిపారు. గురువారం స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల, ఎస్‌కెయు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యూనివర్సిటీ అంతర్ కళాశాల క్రికెట్ టోర్నమెంట్ సెమీ ఫైనల్ పోటీలు ఆర్డీటీ మైదానంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెక్టార్ హాజరై విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు. ఈ పోటీల్లో మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ కదిరి బ్లూమూన్ డిగ్రీ కళాశాల, అనంతపురం శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజీ జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో బ్లూమూన్ కదిరి జట్టు 180 పరుగుల తేడాతో గెలుపొందింది. రెండోవ సెమీ ఫైనల్ మ్యాచ్ అనంతపురం ఎస్ఎస్‌బిఎన్, ఎస్వి డిగ్రీ కళాశాల జట్లు తలపడగా ఎస్ఎస్‌బిఎన్ 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ కార్యక్రమం ఎస్‌కెయు స్పోర్ట్స్ కన్వీనర్ డా॥బి.జెస్సీ, కళాశాల ఛైర్మన్ సి.సోమశేఖర్ రెడ్డి, ఎస్వీ కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర రెడ్డి, ఆర్గనైజింగ్ ఛైర్మన్ డా॥ఎన్‌వి..ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాసులు నాయక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని ఉద్దేహాల్, శ్రీధర్‌ఘట్ట గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా తుంగభద్ర ఆయకట్టు కింద వరి పంట సాగు చేసిన కొందరు రైతులు ఆమెను కలిసి వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని విన్నవించారు. రైతులు మాట్లాడుతూ ఎకరాకు రూ. 40వేలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేయగా ఎకరాకు 35 బస్తాలు దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రభుత్వ ధర కంటే రూ. 500 ఎక్కువగా ఉందన్నారు. కావున దళారీ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వమే గిట్టు బాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని కోరారు. స్పందించిన అధికారిణి ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆమె వెంట ఏవో సాయికుమార్, నాగరాజు ఉన్నారు.

టోల్ ఛార్జీల పెంపును రద్దు చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



రాష్ట్రంలో 65 టోల్ ప్లాజాల వద్ద సింగిల్ ఎంట్రీ విధానంతో వాహనదారులపై పెరిగిన అదనపు టోల్ రుసుముల భారాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. జిల్లాలో రెండు నేషనల్ టోల్ గేట్‌ల మీదుగా ప్రయాణించే వాహనదారులపై వేల రూపాయల భారం పడుతోందన్నారు. కాంట్రాక్టర్లకు టోల్ పేరుతో డబ్బులు ఇస్తున్నా రోడ్ల నిర్వహణ నాసిరకంగా ఉందన్నారు. దీనికి తోడు ఆర్అండ్‌బి రోడ్లపై కూడా టోల్ ప్రవేశ పెడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారని, ఇది వాహనదారులకు మరింత పెనుభారంగా మారే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో మొత్తం 69 టోల్ ప్లాజాలు ఉంటే, వాటిలో 65 టోల్ ప్లాజాలలో సింగిల్ ఎంట్రీ విధానం తీసుకువచ్చి రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు టోల్ రుసుం పూర్తిస్థాయిలో వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనివల్ల సొంత, బాడుగ వాహనదారులపై అధిక భారం పడుతుందన్నారు. అద్దె వాహనాలు నడుపుకునేవారిపైనా ప్రభావం పడి జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రవాణా ఛార్జీలు పెరిగి నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతాయన్నారు.

అనంతపురం – గుత్తి మధ్య గత సెప్టెంబర్ వరకు ఒక కారు ఒకసారి వెళ్లి తిరిగివచ్చి నందుకు రూ.160లు చెల్లించేవారని, ఒకసారి టోల్ చెల్లించిన తరువాత 24 గంటల్లో ఎన్నిసార్లు తిరిగినా రుసుం చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. కొత్త నిబంధనల ప్రకారం రూ.160ల టోల్ ఫీజును రూ.240కు పెంచి రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు రూ.240లు చెల్లించేలా భారం వేశారని తెలిపారు. ఇదే విధంగా అన్ని రకాల వాహనదారులపై భారం పడుతుందన్నారు. 20కి॥మీ॥ లోపల తిరిగే వాహనాలకు గతంలో పసుపు, తెలుపు బోర్డుల పేరుతో పాస్‌లు ఇచ్చేవారని, వీటికి నెలకు రూ.340లు చెల్లిస్తే సరిపోయేదన్నారు. ఇప్పుడు పసుపు బోర్డుకు (అద్దె వాహనాలు) పాస్‌లు పూర్తిగా రద్దు చేశారని, తెలుపు బోర్డు వాహనాలపై రుసుం పెంచారన్నారు. దీనివల్ల సొంత వాహనదారులపై కూడా భారం పెరగనుందన్నారు. ఆర్‌టిసిపైనా అదనపు భారం పడుతుండడంతో దానిని ప్రయాణికులపై వేస్తారని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై పున:సమీక్షించి టోల్ ఛార్జీల భారాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంతకల్లు

ఈ నెల 23, 24 తేదీల్లో అనంతపురంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ స్థానిక హంపిరెడ్డి భవనం నుంచి 60 అడుగుల రోడ్డు మీదుగా, మార్కెట్ యార్డు, పాత గుంతకల్లు, బీరప్ప గుడి సర్కిల్, మెయిన్ రోడ్డు ధర్మవరం గేట్, ట్రావెలర్స్ బంగ్లా, రైల్వేస్టేషన్, మార్కెట్ రోడ్డు మీదుగా పార్టీ కార్యాలయానికి చేరుకుంది. ర్యాలీలో పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యులు రామునాయక్, అబ్దుల్లా, జగదీష్, జాకీర్, షాషా, సూరి, వెంకీ, ఓబులేసు, మస్తాన్, ప్రసాద్, వీరన్న, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-గుత్తి

క్రీడల వల్ల విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా తెలిపారు. పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, తద్వారా దేహదారుఢ్యం పెరుగుతుందన్నారు. అనంతరం క్రీడా పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.మల్కి సాబ్, మున్సిపల్ మేనేజర్ పి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు మెడల్స్ అందజేస్తున్న అతిథులు

హాస్టల్ విద్యార్థి ప్రతిభ

పట్టణంలోని ప్రభుత్వ నెంబర్ వన్ వసతి గృహం విద్యార్థి రాణా ప్రతాప్ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చాటాడు. రాణా ప్రతాప్ కేంద్రీయ విద్యాలయంలో 1వ తరగతి చదువుతున్నాడు. కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన జంపింగ్ పోటీల్లో మొదటి స్థానం సాధించగా సాంఘిక సంక్షేమ సహాయ అధికారిణి బి.రాధిక అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణారెడ్డి, వార్డెన్ బాషా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య స్కూల్‌లో గురువులకు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని హౌసింగ్ బోర్డ్‌లో ఉన్న శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో గురువారం గురువులను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. టిసి.వరుణ్ మాట్లాడుతూ సమాజం, దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర, ప్రాధాన్యత, విద్య ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. 2023-24లో 598 మార్కులతో స్టేట్ ర్యాంకు సాధించడానికి దోహదపడిన ఉపాధ్యాయులకు పురస్కారాలు, నగదు బహుమతి అందజేశారు. అధ్యాపకులు వారి అనుభవాలను మాట, పాట, పద్యం, కవితల రూపంలో విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపల్ షమీనా, అకడమిక్ కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, ఇర్షాద్, తిరుమలేష్, నాగభూషణం, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆర్ఎం సుమన్

ఆర్టీసీ కార్గో సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-అనంతపురం

ఎపిఎస్ ఆర్‌టిసి కార్గో సేవలను మరింత విస్తృతం చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ సుమన్ ఆర్.ఆదోని తెలిపారు. ఆయా సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ నెల 20 నుంచి జనవరి 19వ తేదీ వరకూ ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు కార్గో డోర్ డెలివరీ సేవల గురించి ప్రజలకు తెలపాలన్నారు. జిల్లాలో అనంతపురం, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి పట్టణాల్లో డోర్ డెలివరీ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. 50 కిలోల బరువు వరకు బుకింగ్ చేసిన పార్సిల్, కొరియర్స్‌ను కస్టమర్ ఇంటి వద్దకే చేరుస్తారన్నారు. పార్సిల్ కౌంటర్ నుంచి 10 కిలోమీటర్ల విస్తీర్ణం వరకూ డోర్ డెలివరీ ఉంటుందన్నారు.

'విద్యుత్ పొదుపు.. భవిష్యత్తుకు వెలుగు'

ప్రజాశక్తి-అనంతపురం

మనం పొదుపు చేసే విద్యుత్ భావితరాలకు వెలుగు అని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ తెలిపారు. విద్యుత్ శాఖ పొదుపు ఉత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న మాంటిస్సోరి పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్‌ను ముందు చూపుతో పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు కార్యక్రమంలో కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల విజేతలతో అధికారులు


హెచ్ఎల్‌సి కాలువను పరిశీలిస్తున్న రాజారెడ్డి

హెచ్ఎల్‌సి కాలువ పరిశీలన

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలానికి సరఫరా అయ్యే హెచ్ఎల్‌సి కాలువలో నీటి సరఫరాను గురువారం ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాజారెడ్డి పరిశీలించారు. కాలువగట్ల పటిష్టత, కాలువలో చెత్త తొలగింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పెద్దవడుగూరు సమీపంలోని కాలువలో దట్టంగా పెరిగిన గడ్డి తొలగింపునకు శ్రీకారం చుట్టారు. చివరి ఆయకట్టుకు సాగునీటిని అందించి రైతులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం మిడుతూరు నుంచి పెద్దవడుగూరు పరిసర ప్రాంతాలకు సరఫరా అయ్యే హెచ్ఎల్‌సి కాలువను ఆయన పరిశీలించి నీటి సరఫరాపై రైతులను అడిగి తెలుసుకున్నారు.

23న ఐక్య క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని దొడఘట్ట రోడ్డులో ఉన్న సిఅండ్ఐజిఎం చర్చిలో ఈ నెల 23వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఐక్య క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని నారా లోకేష్ అభిమాన సంఘం అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలో 'ఐక్య క్రిస్మస్ వేడుకలు' ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ ఆ వేడుకలకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న పాస్టర్స్, సంఘ కాపరులు, సువార్తికులు, దైవ సేవకులు, వివిధ సంఘస్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సి అండ్ ఐజిఎం చర్చి ప్రెసిడెంట్ చల్లా రాజశేఖర్, సెక్రటరీ ఆర్థర్‌బాబు, రోజులీ, రాజేష్, ట్రెజరర్ జోసఫ్, కిషోర్, చల్లా కిషోర్, రవి, జ్ఞాన సుందర, సతీష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-పామిడి

పట్టణంలోని 17వ వార్డులో డ్రెయినేజీ కాలువ ఏర్పాటుకు గురువారం టిడిపి నాయకులు భూమి పూజ చేశారు. సాధారణ నిధులు రూ. 7 లక్షలతో డ్రెయినేజీ కాలువ నిర్మాణ పనులు చేపట్టి నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లంగాల గౌస్, జింకల సంజీవ, బొమ్మా మోహన్, వడ్డే శివ, మహమ్మద్ రఫీ, కరూరు శివ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

23న 104 ఉద్యోగుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీ 104 ఉద్యోగులు విధులు బహిష్కరిస్తున్నట్లు 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శివకృష్ణ, కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. వారు గురువారం 104 ఉద్యోగులతో కలిసి బ్రహ్మసముద్రంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వైద్య సేవలకు అంతరాయం కలగకుండా నవంబర్ 1వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం కానీ అరబిందో యాజమాన్యం కానీ స్పందించలేదన్నారు. వారు స్పందించేంత వరకూ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. న్యాయమైన సమస్యలపై చర్చలకు పిలిచి పరిష్కరించకపోతే జనవరి 5వ తేదీ తర్వాత సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం మండల సహాయ కార్యదర్శి పైలెట్ డికె. మల్లికార్జున, డిఇఒ వన్నూరుస్వామి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు


తిరుమలలో కుటుంబ సభ్యులతో విప్ కాలవ

తిరుమలలో విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం కుటుంబ సమేతంగా తిరుమల వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు కాలవకు స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వారికి ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-గుత్తి

గ్రామీణ ప్రాంతాల్లో పకడ్బందీగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని డిఎల్‌డిఒ విజయలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం యాడికి, పెద్దవడుగూరు, పామిడి, గుత్తి మండలాల్లోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మిస్సింగ్ సిటిజెన్ సర్వీసెస్ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, గుత్తి, పామిడి, పెద్దవడుగూరు ఎంపిడిఒలు డి.ప్రభాకర్, తేజోష్ణ, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండలంలోని చాబాల గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను గురువారం స్థానిక టిడిపి నాయకులు పరిశీలించారు. మంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులు చొరవతో గ్రామంలో సీసీ రోడ్డు పనులతో పాటు అభివృద్ధి పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, జె.లింగమూర్తి, ఎన్.మహేష్, ఇంజినీర్ అసిస్టెంట్ ప్రమోద్, కాంట్రాక్టర్లు,తదితరులు పాల్గొన్నారు.

'సాయి విజ్ఞాన్'లో ధ్యాన శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో హార్ట్ ఫుల్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు ఎంపిఎస్ శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, ప్రిన్సిపల్ జి.లావణ్యరామ్ తెలిపారు. విద్యార్థులు ఒత్తిడిని ఎలా అధిగమించాలి, రిలాక్సేషన్, ధ్యానం, సమాజం పట్ల భాధ్యత, తదితర అంశాలపై ధ్యాన బోధకులు సంధ్యారాణి, సత్యవతి బోధించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-శింగనమల

మండల వ్యాప్తంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శింగనమల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఉండదని, రైతులు, ప్రజలు గమనించాలన్నారు.

'పది' విద్యార్థుల ఎన్ఆర్‌లో మార్పులకు అవకాశం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు సంబంధించి ఎన్ఆర్‌లో మార్పులకు ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకూ అవకాశం కల్పించినట్లు విద్యా శాఖ అధికారులు ఎం.ప్రసాద్ బాబు, గోవిందనాయక్ తెలిపారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు వినియోగించుకోవాలన్నారు.

నేడు గ్రహణమొర్రి బాధితులకు వైద్యశిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పెదవి చీలిక, గ్రహణమొర్రి బాధితులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా త్వరిత చికిత్స కేంద్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్-ఎస్.వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తారని తెలిపారు.


నార్పలలో బొలెరోలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలు

ప్రమాదమని తెలిసినా మారని తీరు..!

ప్రమాదమని తెలిసినా కొందరు వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. గురువారం నార్పలలో ఓ బొలెరో వాహనంలో వ్యవసాయ పనులకు వెళ్తున్న మహిళా కూలీలను ఎక్కువ మందిని ఎక్కించి తరలించడం చూసిన వారు వీరిలో ఎప్పటికి మార్పు వస్తుందోనని నిట్టూర్చారు.

ప్రజాశక్తి-నార్పల

22న ధన్వంతరీ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రామ్‌నగర్ ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మించిన ధన్వంతరీ ఆసుపత్రిని ఈ నెల 22వ తేదీ ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి అధినేత డాక్టర్ ఎన్‌వి.శివకుమార్ గురువారం తెలిపారు. ఐదేళ్లుగా నగరంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందామన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో 50 పడకుల ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసుపత్రి నిర్మాణంలో తమ తండ్రి నెట్టెం వెంకటేశులు, సతీమణి మానస, సోదరుడు శ్రీనివాస్, సంగీత విశేష కృషి చేశారని తెలిపారు. అందరి సహకారంతో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు ధన్వంతరి హాస్పిటల్‌లో నాణ్యమైన, మెరుగైన సేవలు అందిస్తామన్నారు.



అంబుజా సిమెంట్ కర్మాగారం పరిశీలన

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని బోయరెడ్డిపల్లి సమీపంలో ఉన్న అదాని గ్రూప్ సిమెంటు కర్మాగారంలో బుధవా రం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడగా ఒకరు మృతి చెందిన విషయం విదితమే. క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి అనంతపురం, ఆ తర్వాత బెంగళూరుకు తరలించారు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం ఆర్‌డిఒ శ్రీనివాసులు, యాడికి తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి ఫ్యాక్టరీకి వెళ్లి పరిశీలించారు. ఘటనపై ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-ఉరవకొండ

బాల్య వివాహాలపై గురువారం డాక్టర్ శ్రీకాంత్‌బాబు, డాక్టర్ జయకుమార్ ఆధ్వర్యంలో విడపనకల్లు మండలంలోని పెద్దకొట్టాలపల్లి జడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. బాల్య వివాహం వల్ల కలిగే నష్టాలు, పిసి పిఎన్‌డిటి చట్టంపై అవగాహన కల్పించారు. లింగ వివక్ష సరికాదని, ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలని సూచించారు. గర్భస్థ లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు నేరమన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే జైలు శిక్ష, జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరిప్రియ, డెంటిస్ట్ చంద్రశేఖర్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఆరోగ్య విస్తరణ అధికారి తిరుపాల్‌నాయక్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి

ప్రజాశక్తి-నార్పల

స్థానిక గూగూడు రోడ్డు, సంత మార్కెట్ రోడ్డు, బస్టాండ్ కూడలి, తదితర రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులు, వాహనదారులు సహకరించాలని ఎస్ఐ సాగర్ కోరారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని దుకాణాలు, హోటళ్ల ముందు ద్విచక్ర వాహనాలను ఎక్కువసేపు ఉంచకుండా త్వరగా పని ముగించుకుని వెళ్లాలన్నారు. ఆయన గురువారం గూగూడు రోడ్డు, సంత మార్కెట్ రోడ్డులో పర్యటించి దుకాణదారులకు పలు సూచనలు చేశారు. ఎవరూ దుకాణాల ముందు వాహనాలు ఉంచకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా వాహనాలను వదిలి వెళ్తే ఫొటో తీసి 9490107853కి వాట్సప్ చేయాలన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని ఎ.కొండాపురం వద్ద తాడిపత్రి-అనంతపురం హైవేపై గురువారం ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసుము విధించారు. వాహనదారులు, ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. అధిక లోడుతో, లైసెన్స్, రికార్డులు లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపి అంబికా ఇంటి వద్ద సందడి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ నివాసం వద్ద గురువారం సందడి వాతావరణం నెలకొంది. ఎంపి అంబికా జన్మదినం సందర్భంగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తంరెడ్డి, తిమ్మారెడ్డి, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఉమాదేవి, లలితాదేవి, లీగల్ అడ్వైజర్ మహేశ్వరి, సుమశ్రీ ఆయనకు పూలబొకే అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-గుత్తి

విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తే భవిష్యత్తులో వెలుగులు ఉంటాయని ఏపీ ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రాజశేఖర్ సూచించారు. జాతీయ ఇంధన వారోత్సవాల్లో భాగంగా గురువారం ఏపీ ఎస్పీడీసీఎల్ డివిజన్ అధికారులు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి గాంధీ కూడలి వరకూ ర్యాలీ చేపట్టారు. ఈఈ మాట్లాడుతూ అవసరమైన సమయంలో తప్ప అనవసరమైన సమయంలో విద్యుత్‌ను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో ఎడిఇ సాయిశంకర్, ఎఇఇలు మధుసూదన్‌రావు, షఫీ, లైన్ ఇన్‌స్పెక్టర్లు కె.నాగేంద్రప్రసాద్, సూర్యనారాయణ, ప్రహ్లాద, ఎఓ విన్సెంట్‌కుమార్, జెఎల్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని తీటకల్లు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. తీటకల్లు గ్రామానికి చెందిన అనంతమ్మ(58) మధ్యాహ్నం ఇంట్లోని నీటి కొళాయికి సంబంధించిన విద్యుత్ మోటార్‌ను ఆన్ చేయగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆమె భర్త లోకిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యం మత్తులో గొడవ.. యువకులకు గాయాలు

ప్రజాశక్తి-గార్లదిన్నె

మద్యం మత్తులో నలుగురు యువకులు కత్తులు, గాజు సీసాలతో దాడి చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి గార్లదిన్నెలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న దాబా ఏరియాలో గార్లదిన్నెకు చెందిన రామ్మోహన్‌రెడ్డి, నాగార్జున అలాగే శింగనమల మండలంలోని నాగలగుడ్డం గ్రామానికి చెందిన ప్రవీణ్, మరో యువకుడు బుధవారం రాత్రి 10 గంటల సమయంలో మద్యం తాగారు. ఆ మత్తులో వారు గాజు సీసాలతో దాడి చేసుకోవడంత రామ్మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కు గాయాలుగా కాగా పోలీసులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగతా ఇద్దరిని అరెస్టు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు.

దాడికి కారణం గంజాయేనా...

మండలంలో కొన్ని రోజులుగా యువకులు గంజాయి తీసుకుంటుటున్నట్లు సమాచారం. బుధవారం రాత్రి జరిగిన గొడవ కూడా గంజాయి కోసమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గొడవ జరిగిన ప్రాంతంలో గంజాయితో ఉన్న కవర్లు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రం నుంచి రాత్రి సమయంలో కొందరు యువకులు గంజాయి తీసుకొచ్చి గార్లదిన్నెలో విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం.

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన ఎంపిపి

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలో వైసిపి బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులా పనిచేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డి సూచించారని ఎంపిపి కమలనాగరాజు తెలిపారు. తాడేపల్లిలోని జగన్ నివాసంలో గురువారం నిర్వహించిన ఎంపిపి, జడ్పిటిసిల సమావేశంలో ఎంపిపి కమలనాగరాజు పాల్గొన్నారు. ఎంపిపి కమలనాగరాజు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని, రాబోయే రోజుల్లో ప్రతి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపినట్లు చెప్పారు.


వైసిపి అధినేత జగన్‌ను కలిసిన ఎంపిపి కమలానాగరాజు

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని భైరసముద్రం సచివాలయాన్ని గురువారం ఎంపిడిఒ నందకిషోర్ సందర్శిం చారు. ఆయన ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు, మూమెంట్ రికార్డ్, హౌస్ టు హౌస్, ఎన్‌పిసిఐ మ్యాపింగ్, హౌస్ హోల్డ్, తదితర సర్వే రిపోర్టులను పరిశీలించారు. త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ నందకిషోర్

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని ఆర్‌డిటి సెంటర్‌లో గురు వారం క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా సెపక్ తక్రా సంఘం ఆధ్వర్యంలో పోలీసు శాఖ, ఆర్‌డిటి, స్థానిక మహేశ్వరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సహాయ సహకారాలతో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ జరిగిన శిక్షణ ముగిసింది. క్రీడా సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ సెపక్‌తగ్రా జట్టు ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ కేరళలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుంది. కార్యక్రమంలో ఆర్‌డిటి ప్రతినిధి క్రిష్టప్ప, రూరల్ సిఐ చిన్న గౌస్, ఎస్ఐ జనార్దన్‌నాయుడు, క్రీడా సంఘం జిల్లా సం ఘం కార్యదర్శి ఎంఎన్. షాహిన్, హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం. దావూద్, గణేష్‌బాబు పాల్గొన్నారు.


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన అధికారులు

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్టు

630 కిలోల రాగి, అల్యూమినియం వైర్లు స్వాధీనం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

రైతుల వ్యవసాయ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల పగుల గొట్టి అందులోని కాపర్, అల్యూమినియం వైర్లు దొంగిలించే అంతర్ జిల్లా దొంగలను సీసీఎస్, అనంతపురం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ పి.జగదీష్ వెల్లడించారు. కంబదూరు మండలం నూతి మడుగు గ్రామానికి చెందిన రాఘవేంద్ర, ఎర్రిస్వామి, రాంపురం గ్రామానికి చెందిన చిరంజీవి, పరంధామతో పాటు కంబదూరు మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన వాసు, వెంకటాంపల్లి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి అలియాస్ జానీలు ముఠాగా ఏర్పడి వ్యవసాయ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను బద్దలు కొట్టి అందులోని కాపర్‌వైర్‌ను దొంగలించేవారు. వీరిలో కీలక నింది తుడు రాఘవేంద్ర ఎలెక్ట్రీషియన్‌గా ఉంటూ విద్యుత్ శాఖ స్థానిక అధికారులు, హెల్పర్లకు సపోర్ట్ వర్కర్‌గా పనికి వెళ్లేవాడు. రైతుల వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరీలో తనకున్న అనుభవంతో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి అల్యుమినియం, వైర్లను దొంగలించేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకోసం విద్యుత్ బిల్లులు తీసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులైన చిరంజీవి, పరంధామ లను జత చేసుకున్నాడు. వీరితో పాటు పరారీలో ఉన్న వాసుతో పాటు వన్నూరుస్వామి ఎ.జానీ, ఎర్రిస్వామిలు తోడయ్యారు. ఈ ముగ్గురు కూడా విద్యుత్ శాఖ హెల్పర్లకు సపోర్ట్ వర్కర్లుగా వెళ్లేవారు. వీరంతా ముఠాగా ఏర్పడి గతేడాది నుంచి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలలోని వ్యవసాయ తోటల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లలో రాగివైరును చోరీ చేయడం అలవాటు చేసుకున్నారు. విక్రయించేందుకు సులువుగా ఉండేలా వైర్లను ముద్దలుగా చేయించి స్థానిక కక్కలపల్లి సమీపంలోని ఓ గుడిసెలో దాచేవారు. ఇలా దాచిన కాపర్‌వైర్‌ను హైదరాబాద్‌లో విక్రయించేందుకు సిద్ధమైన సమయంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఈ ముఠాపై అనంత పురం ఎఎస్పీ డివి.రమణ మూర్తి పర్యవేక్షణలో అనంతపురం సిసిఎస్ సిఐలు ఇస్మాయిల్, జైపాల్ రెడ్డి, రూరల్ సిఐ శేఖర్, రూరల్ ఎస్ఐ రామ్‌బాబుల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా వేశారు. రాబడిన సమాచారంతో సిసిఎస్, అనంతపురం రూరల్ హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు బృందంగా ఏర్పడి నిందితులు రాఘవేంద్ర, ఎర్రిస్వామి, చిరంజీవి, పరంధామ, వన్నూరుస్వామి అలియాస్ జానీలను గురువారం అరెస్టు చేశారు. మరో నిందితుడు కంబదూరు మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన వాసు పరారీలో ఉన్నాడు. వీరి నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన 450 కిలోల రాగివైర్లు, 180 కిలోల అల్యూమినియం వైర్లను స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



బెళుగుప్పలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ తిప్పేనాయక్

ప్రజాశక్తి-బెళుగుప్ప

గ్రామాల్లో రైతులు, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ తిప్పేనాయక్ తెలిపారు. మండలంలోని ఎర్రగుడి, ఆవులెన్న గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించగా ముఖ్యఅతిథిగా కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ తిప్పేనాయక్ హాజరై కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని ప్రజలకు వివరించారు. రైతులు, ప్రజలు వారి సమస్యలపై అర్జీలు ఇస్తే అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. ఆవులెన్న గ్రామం లో 10, ఎర్రగుడిలో 2 అర్జీలు అందగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సదస్సుల్లో తహశీల్దార్ సి.షర్మిల, ఆర్ఐ రమాదేవి, ఆవులెన్న సర్పంచి రామ్మోహన్‌నాయుడు, లక్ష్మీనారాయణ, రెవెన్యూ అధికారి వెన్నెల, ఓబయ్య, రాజన్న, రఘు, చిరంజీవి అశోక్ పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్‌డిఒ వసంతబాబు తెలిపారు. మండలంలోని వేపులపర్తి గ్రామంలో సర్పంచి రంగప్ప అధ్యక్షతన తహశీల్దార్ సుమతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌డిఒ మాట్లాడుతూ సదస్సులో 22 వినతులు అందాయని పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని తహశీల్దార్ తెలిపారు. సదస్సులో ఆర్ఐ నాగిరెడ్డి, విఆర్ఒ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, నాయకులు హనుమంతప్ప, భీమప్ప, పెన్నప్ప, ధనుంజయ, భీరేష్, చంద్ర, రవి, పూజారి రుద్రప్ప, మహేష్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని ఈస్ట్ కోడి పల్లెలో తహశీల్దార్ భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. సచివాలయ భవన నిర్మాణం పూర్తి చేయాలని, గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒతో పాటు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వో నారాయణస్వామి, అధికారులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ పాత భవనంలో తహశీల్దార్ డి.ఓబులేసు ఆధ్వర్యంలో అధికారులు సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై రైతులు, ప్రజలు అర్జీలు ఇచ్చారు. సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ, ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ మంజునాథ్, మండల సర్వేయర్ సాయి, వీఆర్వోలు టి.సురేంద్ర, వెంకటరాముడు, నాగరాజు, శాంతి, అనురాధ, కిషోర్, రంగస్వామి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మహబూబ్‌బాషా సూచించారు. మండలంలోని బూదగవి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలే కాకుండా గ్రామంలో ఏ సమస్య ఉన్నా అర్జీ రూపంలో తెలపాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల : శింగనమలలో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా వివిధ సమస్యలపై 18 అర్జీలు అందాయి. వాటిని పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. సదస్సులో ఎంపిడిఒ నిర్మాలకుమారి, ఎస్ఐ శరత్‌చంద్ర, సర్పంచి నాగ మునెమ్మ, వైఎస్ ఎంపిపి విజయ, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, శింగనమల ఆయకట్టు సంఘం అధ్యక్షులు జి.సత్యనారాయణ, మాసూల చంద్రమోహన్, పెద్దనాగముని, బండి వెంకటనారాయణ, గ్రామ సర్వేయర్ పవన్ కుమార్, విఆర్ఒ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆయకట్టు భూములకు రహదారులు ఏర్పాటు చేయాలి

శింగనమల శ్రీరంగరాయలుచెరువు ఆయకట్టు భూములకు రహదారులు ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్పయాదవ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం ఇచ్చారు. చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ ఆయకట్టు మొదటి పొలం నుంచి చివరి పొలం వరకూ 2 కి.మీ దూరం ఉంటుందని, అయితే సరిగా రహదారులు లేక మందులు, ధాన్యం బస్తాల రవాణా, రాకపోకలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయకట్టు చివరి భూముల వరకూ రహదారులు ఏర్పాటు చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో బాలకృష్ణ, శివయ్య, నన్నేసాహెబ్, పెద్దన్న, తదితరులు ఉన్నారు.

దళితుల భూములను వారికే అప్పగించాలి

డి.హీరేహాల్ : దళితుల భూములను దళితులకే అప్పగించాలని కోరుతూ గురువారం మండలంలోని ఓబుళాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ గ్రామంలోని దళితులు, వెనుకబడిన కుటుంబాలకు 1980లో అప్పటి ప్రభుత్వం అసైన్డ్ భూములు మంజూరు చేసిందన్నారు. ఆ భూములను మైనింగ్ కార్యకలాపాల కోసం ఒఎంసి, బిఐఒపి కంపెనీలు 2005లో రైతుల నుంచి అతి తక్కువ ధరకు తీసుకున్నాయన్నారు. ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ దృష్టికి తీసుకెళ్లగా మీ గ్రామంలో పెద్ద స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని భూ నిర్వాసిత రైతు కుటుంబాలకు ఉద్యోగాలతో పాటు ఎకరాకు రూ. ఐదు లక్షల వరకూ నష్టపరిహారం ఇస్తామన్నారన్నారు. భూములు సేకరించి 20 ఏళ్లయినా పరిశ్రమ ఏర్పాటు చేయకపోవడంతో భూములు కోల్పోయిన దళితులు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారన్నారు. కావున ఓబుళాపురం గనుల ప్రాంతంలో ఒఎంసి, బిఐఒపి, ఎపిఐఐసి ద్వారా తీసుకున్న భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి సత్యప్పగారి వెంకటేశులు, టిడిపి నాయకులు బసప్ప, బసవరాజు, నాగేంద్ర, హులిగప్ప పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని కుమ్మనమల రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన సదస్సులో 8 అర్జీలు అందినట్లు తహశీల్దార్ శేషారెడ్డి తెలిపారు. అందులో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలినవి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సులోమండల సర్వేయర్ శాంతి, ఎఎస్ఒ విజయ్‌కుమార్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పామిడిలో రెవెన్యూ సదస్సు

పామిడి : ప్రజల సమస్యల పరిష్కారం కోసమే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు.



ఎంపి అంబికా జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఎంపి అంబికా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలను గురువారం నగరంలోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో టిడిపి అభిమానులు ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి ఉచిత వైద్య, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి సుమారు 500 మందికి వైద్య సేవలు అందించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేశారు. పలువురు నోట్ పుస్తకాలు, పెన్నులు తీసుకువచ్చారు. అలాగే నగరంలోని ఆర్ కన్వెన్షన్ హాలులో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా లక్ష్మీనరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

పామిడి : అనంతపురం నిర్వహించిన ఎంపి అంబికా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకల్లో మండలంలోని జనసేన, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొని ఎంపి అంబికాకు పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మా మోహన్, మనవల ఆంజనేయులు, ఎపి మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల కోదండరామిరెడ్డి, కొట్టాల సూర్యనారాయణ, వడ్డే రాము, నక్కల రామాంజనేయులు, వీరప్రతాప్, నాగేంద్ర, నక్కల నవీన్, రాజు, రవితేజ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిని కలిసిన 'దేగల'

శింగనమల : ఎంపి అంబికా లక్ష్మీనారాయణను గురువారం టిడిపి అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి నగరంలోని ఎంపి నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేగల ఎంపిని పూలబొకే, శాలువాతో సన్మానించారు. ఎంపిని కలిసిన వారిలో నాయకులు శివాజీ, కొయ్యగూర పెద్దన్న, వడ్డే రామకృష్ణ ఉన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని నందమూరినగర్‌లో ఉన్న త్యాగరాజుకాలనీకి చెందిన బాషా(32) క్యాన్సర్‌తో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్నారు. బాషా కుటుంబానికి గురువారం నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు, షిరిడీ సాయి అన్నదాన కమిటీ సహకారంతో రెండు నెలలకు సరిపడా 35 రకాల నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో కవిన్ ఆదిత్య, ఓబుళపతి, పాల్గొన్నారు.

వైఎస్.జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు


ప్రజాశక్తి అనంతపురం రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లా వైసిపి నాయకులు గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. అంతకుముందు జగన్ జిల్లాకు చెందిన వైసిపి ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు. అనంతరం ఆమె జగన్‌ను ప్రత్యేకంగా కలిసి జిల్లాలో పార్టీ, రాజకీయ పరిస్థితులను వివరించారు. జిల్లాలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారికి జగన్ సూచించారు.

రాయదుర్గం : నియోజకవర్గ వైసిపి నాయకులు పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, మున్సి పల్ ఛైర్‌పర్సన్ పోరాలు శిల్ప, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, తదితరులు నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను జగన్‌కు వివరించారు.

ఉరవకొండ : వైసిపి అధినేత జగన్‌ను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపారు.

శింగనమల : తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు జగన్‌ను జిల్లా నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి కలిసి అడ్వాన్స్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



వైసిపి అధినేత జగన్‌ను కలిసిన అనంత వెంకటరామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, పోరాలు శిల్ప, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ



రాయదుర్గంలో టిడిపి సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాలు పురుషోత్తం, 9వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి పోరాలు గౌరీ ఆధ్వర్యంలో గురువారం నాటికి పట్టణంలోని 6, 9 వార్డుల్లో 2,050 సభ్యత్వాలు నమోదు చేయించారు. వారు ఇంటింటికీ వెళ్లి టిడిపి సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి సభ్యత్వ నమోదు చేయించారు. సభ్యత్వ నమోదులో పోలింగ్ బూత్ స్థాయి సహాయకుడు సాయితేజ, భజంత్రి కృష్ణ, ఇస్మాయిల్, కార్యకర్తలు తదితరులు, పాల్గొన్నారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-కుందుర్పి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బొజ్జప్ప డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థానంలో ఉన్న అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, వాటిని ప్రధాని మోడీ సమర్థించడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గౌని తిప్పేస్వామి, ఎర్ర రామాంజనేయులు, నిజవల్లి గోపాల్, రామన్న, హనుమంత రాయుడు, గొల్ల హనుమంత రాయుడు, చిత్తప్ప, తలారి హనుమంతరాయుడు, బొట్టు ఆంజనేయులు, చిక్కన్న, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం ఆయన విద్యార్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అనుచిత వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అమిత్‌షా అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం చేయాలని, లేనిచో దేశ వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజా, శ్రీనివాస్, శీనునాయక్, ధరణికుమార్, చంటినాయక్, భాస్కర్, అశోక్, రామకృష్ణ, అంజి, సుంకన్న పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

ఈ నెల 20వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకూ 'డోర్ డెలివరీ మాసోత్సవం' నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. డిపో ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మేనేజర్ మాట్లాడుతూ ఈ మాసోత్సవంలో ప్రతి ఆర్టీసీ ఉద్యోగి కనీసం 3 పార్సిల్స్ బుక్ చేసి సంస్థ డోర్ డెలివరీ సౌకర్యం గురించి వర్తకులు, వినియోగదారులకు ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో డిపోమేనేజర్ శ్రీనివాస రావు, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ శిరీష, ఎంసి కృష్ణయ్య, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాగరాజు, ఎడిసిలు, కండక్టర్లు, డ్రైవర్లు, మెకా నిక్‌లు పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు